భారత్... మౌలిక సదుపాయాల ఆవశ్యకత!

భారతదేశం సాధిస్తున్న అధికవృద్ధి రేటు... అవస్థాపనా సౌకర్యాల ఆవశ్యకతను తెలుపుతోంది. సంస్కరణల కాలంలో... ప్రభుత్వం తన విధానాల్లో మార్పు తీసుకురావడం ద్వారా... మౌలిక సదుపాయాల కల్పనలో ప్రయివేటు రంగానికి అనుమతించింది. పట్టణ ప్రాంతాలలోనే ఎక్కువగా కేంద్రీకృతమైన ఈ సౌకర్యాలు... దేశంలో ప్రాంతీయ అసమానతలు, ఆదాయ అసమానతలకు కారణమయ్యాయి. ఫలన కాలం ఎక్కువగా ఉండే ఈ పెట్టుబడుల విషయంలో... ప్రయివేటు రంగం పాత్ర పరిమితంగా ఉన్నందువల్ల, ప్రభుత్వరంగ పెట్టుబడులు సమర్థనీయం!!

గ్రామీణ ప్రాంతాలలో... అవస్థాపనా సౌకర్యాల (Infrastructure) కల్పనలో ప్రభుత్వ రంగ పెట్టుబడులు వచ్చే విధంగా సంస్కరణలు ప్రవేశ పెట్టాలి. సామాజిక న్యాయం ధ్యేయంగా... ప్రభుత్వం ఒకవైపు ప్రయత్నిస్తూనే... అధిక పెట్టుబడులు అవసరమైన అవస్థాపనా సదుపాయాల కల్పనలో ప్రయివేటు రంగాన్ని ప్రోత్సహించాలి. ఆర్థికాభివృద్ధి విధానం లక్ష్యాలను నెరవేర్చాలంటే... ఆర్థికాభివృద్ధి జరగడానికి ముందు, అభివృద్ధి జరుగుతున్నపుడు.. అభివృద్ధి జరిగిన తర్వాత కూడా... ప్రతి దేశంలోను అవస్థాపనా సౌకర్యాల ఆవశ్యకత ఎంతో ఉంది. అభివృద్ధి చెందిన దేశాలు... ఆర్థిక ప్రగతి సాధించడానికి మౌలిక సౌకర్యాలు ఎంతో తోడ్పడ్డాయి. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల ప్రగతి... అవస్థాపనా సౌకర్యాలపై ఆధారపడి ఉంటుంది.

మొదటి ప్రణాళిక నుంచే:

రవాణా, సమాచారం, విద్యుచ్ఛక్తి, నీటిపారుదల, వరదల నివారణ, రుణ సదుపాయాలు... వ్యవసాయరంగంలో అధిక ఉత్పత్తి సాధించడానికి అవసరమైన అవస్థాపనా సౌకర్యాలు. కాగా, ఇంధన వనరులు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ సదుపాయాలు, మార్కెటింగ్, రోడ్లు, రైల్వేలు, యంత్ర సామగ్రి... పారిశ్రామిక రంగ ప్రగతికి అవసరమైన మౌలిక వసతులు. విద్యా, వైద్య, విజ్ఞాన, సాంకేతిక పరిజ్ఞానం, పారిశుధ్యం మొదలైన వాటిని కూడా అవస్థాపనా సౌకర్యాలుగా భావించవచ్చు. స్వాతంత్ర్యానంతరం అవస్థాపనా సౌకర్యాల లభ్యత, ఆర్థికాభివృద్ధికి మధ్య ఉన్న సంబంధాన్ని గుర్తించిన ప్రణాళికా నిపుణులు... మొదటి ప్రణాళిక నుంచే ఈ సౌకర్యాల విస్తరణకు ప్రాధాన్యమిచ్చారు. ప్రణాళికలలో 50% పెట్టుబడిని అవస్థాపనా సౌకర్యాల కోసం వ్యయం చేస్తుండటంతో.. ఈ సౌకర్యాల



కల్పనలో భారతదేశం అధిక పెరుగుదల రేటును నమోదు చేసుకుంది. మౌలిక వసతుల ఫలన కాలం ఎక్కువ. అందువల్ల ప్రయివేటు రంగ పెట్టుబడులు తక్కువగా ఉంటాయని భావించి.. ప్రభుత్వ రంగ పెట్టుబడులు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇటీవల కాలంలో... భారత్ సాధిస్తున్న అధిక వృద్ధిరేటు.. అవస్థాపనా సౌకర్యాల అభివృద్ధికి ఉన్న అన్ని అవరోధాలు తొలగించాల్సిన ఆవశ్యకతను తెలియజేస్తోంది. విద్యుచ్ఛక్తి, రోడ్లు, పోర్టులు, ఎయిర్‌పోర్ట్‌లు, టెలికమ్యూనికేషన్స్ ప్రభుత్వ పరిధిలో ఉండేవి. గత రెండు దశాబ్దాలుగా డిమాండ్, సప్లయ్ మధ్య తేడా ఎక్కువగా ఉండటం... క్వాలిటీ ఆఫ్ ఎసెట్స్‌లో తగ్గుదల ప్రభుత్వ విధానంలో మార్పునకు కారణమైంది. ప్రభుత్వం తన విధాన దృక్పథంలో మార్పు తీసుకురావడం ద్వారా... మౌలిక సదుపాయాల రంగంలో ప్రయివేటుకు అనుమతించింది. తద్వారా ప్రభుత్వ, ప్రయివేటు రంగాలు తమ సామర్థ్యాలకు తగిన విధంగా పెట్టుబడులు పెట్టే అవకాశం ఏర్పడింది.

సంస్కరణల యుగం :

1991లో దేశంలో ఆర్థిక సంస్కరణలు ప్రారంభమయ్యాక అవస్థాపనా సౌకర్యాల రంగంలో.. ప్రయివేటు పెట్టుబడులను ప్రోత్సహించే వాతావరణాన్ని ప్రభుత్వం కల్పించింది. 1997లో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కంపెనీని రూ.5,000 కోట్ల అధీకృత మూలధనంతో ప్రారంభించారు. రోడ్లు, బ్రిడ్జీలు, పారిశుధ్యం, నీటి సరఫరా, ఎయిర్‌పోర్ట్‌లు, నౌకాయానాలు, రైల్వే ప్రాజెక్ట్‌లను అభివృద్ధిచేసి, నిర్వహించే కంపెనీలకు ప్రభుత్వం పన్నుల విరామాన్ని ప్రకటించింది. ఈ సౌకర్యాల కల్పనలో విదేశీ పెట్టుబడులపై ఉన్న ఆంక్షలు తొలగించారు. ఇంధన రంగంలో, రోడ్లు, బ్రిడ్జ్‌లు, నిర్మాణ రంగం, కొరియర్ సర్వీసులలో... 100 శాతం విదేశీ పెట్టుబడులకు అనుమతించారు. టెలికమ్యూనికేషన్లు, బ్యాంకింగ్ రంగంలో 74శాతం;పౌర విమానయానం, బీమా రంగంలో 49% విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు ప్రభుత్వం అనుమతించింది. నేషనల్ హైవేస్ అథారిటీ కార్పస్‌ను రూ.200 కోట్లకు పెంచడం ద్వారా... స్వదేశీ, అంతర్జాతీయ మూలధన మార్కెట్‌లో పెట్టుబడులు సమకూర్చు కొనే అవకాశం కల్పించారు.

దీపక్ పరేఖ్ కమిటీ:

అవస్థాపనా రంగంలో పెట్టుబడుల ప్రోత్సాహానికి ఉన్న అవరోధాలను గుర్తించి.. వాటి నివారణకు సూచనలు చేసేం దుకు ప్రభుత్వం.. 2006లో దీపక్ పరేఖ్ అధ్యక్షతన ఒక కమిటీ ఏర్పాటు చేసింది. ఈ కమిటీ 2007, మేలో తన నివేదిక ప్రభుత్వానికి సమర్పించింది. కొన్ని సంస్థాపరమైన, స్థూల ఆర్థిక పరమైన అడ్డంకులను వివరించింది. స్థూల దేశీయోత్పత్తిలో (జీడీపీలో) పొదుపు రేటు పెరుగుతున్నప్పటికీ... ఈ మొత్తం పొదుపులో దీర్ఘకాల పొదుపు తక్కువగా ఉందని కమిటీ అభిప్రాయపడింది. ద్రవ్యబాధ్యత, బడ్జెటరీ యాజమాన్య చట్టం (Fiscal Responsibility and Budget Management Act) ప్రకారం... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెటరీ మద్దతు పరిధి తక్కువగా ఉండటం.. ప్రభుత్వం ఇచ్చే గ్యారంటీలపై ఉన్న నియంత్రణలు... అవస్థాపనా రంగంలో పెట్టుబడులకు అవరోధంగా ఉన్నాయని కమిటీ పేర్కొంది. ఒకే రంగానికి ప్రాధాన్యత ఇస్తూ.. పెట్టుబడులు పెంచే చర్యలు చేపట్టినపుడు నష్ట భయం ఏర్పడి, ఈ రంగంలో పెట్టుబడులు తగ్గే అవకాశముందని...ఆర్థిక వ్యవస్థలో విదేశీ మూలధన ప్రవాహం కూడా తగ్గుతుందని కమిటీ తెలిపింది. స్వదేశీ రుణ మూలధన మార్కెట్‌ను అభివృద్ధి చేయడం ద్వారా అవస్థాపనా రంగంలో పెట్టుబడులను పెంచడానికి బ్యాంకింగ్, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలను ప్రోత్సహించడం... విదేశీ పెట్టుబడులను ఈ రంగానికి మళ్లించడం.. విదేశీమారక ద్రవ్య నిల్వలను ఈ రంగ అభివృద్ధికి ఉపయోగించడం.. బీమారంగ పొటెన్షియల్‌ను ఉపయోగించుకోవడం.. కోశపరమైన నిర్ణయాల ద్వారా మౌలిక సదుపాయాల రంగంలో పెట్టుబడుల ప్రోత్సాహానికి చర్యలు తీసుకోవాలని కమిటీ సూచించింది.

అవస్థాపనా సౌకర్యాల లభ్యత :

1950-51 నుంచి 2005-06 మధ్య కాలంలో... బొగ్గు ఉత్పత్తి 32 మిలియన్ టన్నుల నుంచి 437 మిలియన్ టన్నులకు పెరిగింది. 2006-07 ఏప్రిల్ నుంచి డిసెంబర్ మధ్య కాలంలో.. బొగ్గు ఉత్పత్తిలో వృద్ధి 4.5 శాతం. కాగా 2007-08 ఏప్రిల్-డిసెంబర్‌లో అది 4.9 శాతానికి పెరిగింది. విద్యుత్ ఉత్పత్తి 1950-51లో... 5 బిలియన్ కిలోవాట్లు. కాగా అది 2005-06లో 623 బిలియన్ కిలోవాట్లకు పెరిగింది. ఇదే కాలానికి సంబంధించిన స్టీల్ ఉత్పత్తి 1 మిలియన్ టన్ను నుంచి 44.5 మిలియన్ టన్నులకు చేరుకోగా... సిమెంట్ ఉత్పత్తి 2.7 మిలియన్ టన్నుల నుంచి 148 మిలియన్ టన్నులకు పెరిగింది. పెట్రోల్, చమురు ఉత్పత్తి 0.4 మిలియన్ టన్నుల నుంచి 32 మిలియన్ టన్నులకు; రైల్వే వస్తు రవాణా 73 మిలియన్ టన్నుల నుంచి 666 మిలియన్ టన్నులకు; ముఖ్య నౌకాశ్రయాలలో Cargo handled 19 మిలియన్ టన్నుల నుంచి 424 మిలియన్ టన్నులకు పెరిగింది. 2005-06 నాటికి మొత్తం 142 మిలియన్ల టెలిఫోన్ కనెక్షన్‌లు ఉన్నాయి.2006-07 ఏప్రిల్-డిసెంబర్, 2007-08 ఏప్రిల్-డిసెంబర్ మధ్య కాలాలలో... వివిధ అవస్థాపనా సదుపాయాల ఉత్పత్తి వృద్ధి పరిశీలించగా... స్టీల్ వృద్ధి 11.1 శాతం నుంచి 6.4 శాతానికి; సిమెంట్ వృద్ధి 10.5 శాతం నుంచి 7 శాతానికి; పెట్రోలియం క్రూడ్ 6.1 నుంచి 0.3; పెట్రోలియం రిఫైనరీ 13.2% నుంచి 7.5 శాతానికి తగ్గింది. ఇదే కాలంలో విద్యుత్ ఉత్పత్తిలో వృద్ధి 7.5 శాతం నుంచి 6.6 శాతానికి; రైల్వే సరకుల రవాణా వృద్ధి 9.7 శాతం నుంచి 8.2 శాతానికి తగ్గింది. నౌకాశ్రయాలలో Cargo handling వృద్ధి 8.3 శాతం నుంచి 12.5 శాతానికి పెరిగింది. టెలికాం రంగానికి సంబంధించి వైర్‌లెస్ కనెక్షన్‌ల వృద్ధి 46.9% నుంచి 44.5%కు; మొత్తం టెలిఫోన్ కనెక్షన్‌ల (ఫిక్స్‌డ్‌తో కలిపి) వృద్ధి 33.7% నుంచి 32.6%కు తగ్గింది. 2007-08 ఏప్రిల్, డిసెంబర్ మధ్య కాలంలో... స్టీల్, సిమెంట్, పెట్రోలియం ఉత్పత్తి వృద్ధి రేట్లు తగ్గగా... బొగ్గు ఉత్పత్తిలో కొంత పెరుగుదల కనిపించింది.

ప్రాంతీయ అసమానతలు:

స్వాతంత్ర్యానంతరం వ్యవసాయం, పారిశ్రామిక ఉత్పత్తుల పెరుగుదలకు.. జాతీయ, తలసరి ఆదాయాల పెరుగుదలకు అవస్థాపనా సౌకర్యాలు ఎంతో చేయూతనిచ్చాయి. అయితే, ఈ సౌకర్యాలు ఎక్కువగా పట్టణ ప్రాంతాలలోనే కేంద్రీకృతమవడం వల్ల గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య అసమానతలు పెరిగాయి. వీటి కల్పనలో గ్రామీణ ప్రాంతాలు నిర్లక్ష్యానికి గురవడం వల్ల సరైన అభివృద్ధిని సాధించలేక పోయాయి. బహుళార్థక సాధక ప్రాజెక్టుల నిర్మాణం, గ్రామీణ విద్యుదీకరణ వల్ల గ్రామీణ ప్రాంతాలలో భూస్వాములు లబ్ధి పొందారు. కాగా చిన్నతరహా నీటి పారుదల సౌకర్యాల అభివృద్ధికి తగినంత ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో... సన్నకారు రైతులకు మేలు చేకూరలేదు. దేశంలో పారిశ్రామికీకరణ కూడా ఈ సౌకర్యాల కల్పన ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో జరగడంతో ఆయా ప్రాంతాలలో ప్రజల ఉపాధి, ఆదాయాలు పెరిగి... ప్రాంతీయ అసమానతలకు దారితీసింది. విద్యుత్, రవాణా, సమాచారం, విద్య, ఆరోగ్య సౌకర్యాల విషయంలో... అధిక ఆదాయవర్గాల వారే లబ్ధి పొందారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఉపాధి కోసం పట్టణ ప్రాంతాలకు వలసలు పెరిగి... పట్టణాలలో మురికి వాడలు పెరగడం,నివాస సమస్యలు,రవాణా సమస్యలు తలెత్తాయి. గ్రామీణ ప్రాంతాలలో ఈ సౌకర్యాల కల్పనకు ప్రభుత్వ పెట్టుబడులు సమర్థనీయం.

11వ పంచవర్ష ప్రణాళిక :

11వ పంచవర్ష ప్రణాళికలో.. లక్షిత వృద్ధిరేటు 9 శాతం సాధించాలంటే... భౌతిక అవస్థాపనా సౌకర్యాలైన విద్యుచ్ఛక్తి, రైల్వేలు,రోడ్లు, గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యం, నౌకా శ్రయాలు, ఎయిర్‌పోర్ట్‌లు, నీటిపారుదల రంగాలకు పెట్టు బడులు పెంచాలి. ఈ సదుపాయాల కల్పనకు వ్యయం చేసిన పెట్టుబడులు... 2006-07లో జీడీపీలో 5 శాతం. కాగా ప్రణాళికాంతానికి ఈ పెట్టుబడులను 9 శాతానికి పెంచాల్సిన అవసరముంది. 2006-07లలో భౌతిక అవస్థాపనా సౌకర్యాల పై పెట్టుబడులు రూ. 20,60,000 కోట్లు అవసరమవుతాయని అంచనా. ఈ మొత్తంలో కేంద్ర ప్రభుత్వ వాటా 37.16 శాతంగా... రాష్ట్ర

ప్రభుత్వాల వాటా 32.76 శాతం గాను.. ప్రయివేటు రంగం వాటా 30.07 శాతంగానూ ఉంటుంది. మొత్తం వ్యయంలో రూ.10,64,000 కోట్లను రుణేతర (Non debt) రూపంలోను... రూ. 9,96,000 కోట్లను రుణ రూపంలోను స్వీకరిస్తారు. 2008-09లో లక్షిత పెట్టుబడి (రుణ, రుణేతర రూపంలో కలిపి) రూ. 3,22,000 కోట్లని అంచనా. స్వదేశీ బ్యాంక్ పరపతి, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు, పెన్షన్ అండ్ ఇన్సూరెన్స్ ఫండ్స్, బహిర్గత వాణిజ్య రుణాల రూపంలో పెట్టుబడికి అవసరమైన రుణాన్ని సమీకరిస్తారు!!.